## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**శివ్వంపేట, ఆగస్టు4 ప్రభాతవార్త:** పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శివ్వం పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చెన్నాపూర్ గ్రామానికి చెందిన గుమ్మాల ఆంజనేయులు (40) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పని ముగించుకొని రోజూ వచ్చే ముందు మద్యం సేవించి వస్తుండగా భార్య ఎల్లమ్మ ఆంజనేయులును రోజూ ఎందుకు తాగి వస్తున్నావ్, మనకు ఉన్న అప్పులు ఎలా కట్టుకుంటామని ఆమె అడుగుతుండటం తో ఆంజనేయులు ఆమెను కొట్టాడు. ఆమెను కొట్టడంతో ఎల్లమ్మ తిమ్మాపూర్‌లోని ఆమె ఆడపడుచు ఇంటికి వెళ్లగా అంతలోనే ఆమె మరిది రాజు ఫోన్ చేసి అన్న ఆంజనేయులు ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి కింద పడ్డాడని చెప్పాడు. చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి నుండి సంగారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 7 గంటలకు ఆంజనేయులు మృతి చెందాడు. మృతుని భార్య ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## రైతుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**దరఖాస్తు చేసుకోవడానికి నేడు చివరి తేదీ : శ్వేత కుమారి**

**కొల్చారం, ఆగస్టు4 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ రైతుభీమా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుభీమా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 5వ తేదీ (నేడు) చివరి తేదీ అని తెలిపారు. జూన్ 28వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు, గతంలో రైతుభీమా కొరకు దరఖాస్తు చేసుకోని రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు దరఖాస్తు పత్రాలతో పాటు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను జత చేసి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారు లకు అందజేయాలన్నారు. 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల లోపు ఉన్న రైతులే రైతుభీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు రైతుభీమాను సద్వినియోగం చేసుకో వాలని మండల రైతులకు మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి సూచించారు

## మెడికల్ కాలేజీకి మరో మూడు పీజీ కోర్సులు

**మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీష్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలకు మరో మూడు పీజీ కోర్సులు మంజూరు వచ్చినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ కళాశాలలో గత ప్రభుత్వంలోనే పీజీ కోర్సులు, 58 సీట్లు ఉండగా మరో మూడు కొత్తగా మంజూరు వచ్చినట్లు తెలిపారు. కొత్తగా అనస్తేసియా 6 సీట్లు,పిడియాట్రిక్ 4 సీట్లు, డెర్మాటలాజీ 4 సీట్లు మంజూరు వచ్చినట్లు తెలిపారు. మొత్తం 16 కోర్సులు 72 సీట్లు ఉన్నాయన్నారు. ఈ విద్యా సంవత్సర నుంచే నూతన కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. కొత్త మెడికల్ కాలేజీలలో 16 పీజీ కోర్సుల ఉన్న మెడికల్ కాలేజీగా సిద్దిపేట వైద్య కళాశాల రికార్డు సాధించిందన్నారు.

## రైతే దేశానికి వెన్నుముక : కలెక్టర్



వరి నాట్లు వేస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు

**మెదక్ అర్బన్, ఆగస్టు4 ప్రభాతవార్త :** రైతే దేశానికి వెన్నుముక అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ దంపతులు కలెక్టర్ క్యాంపు ఆఫీస్‌ను ఆనుకొని ఉన్న ఔరంగాబాద్ గొల్ల నారాయణ రైతు పొలంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు వారాంతంలో ఇద్దరు పిల్లలను తీసుకొని రైతులతో కలిసి వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి నారు మంది నుంచి పంట అమ్మకం వరకు ప్రతి దశలో రైతుకు అండగా ఉంటూ అవసరమైన సలహాలు, సూచనలు అందజేసి రైతు లాభదాయ సాగు చేసే దిశగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. వరి నాట్లు వేస్తున్న రైతుల పొలాలను పరిశీలించి సాగు పద్ధతులను, పంటలో వచ్చే లాభం, సాగులో ఎదరవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## విద్యుత్ సమస్యలు తలెత్తితే దృష్టికి తేస్తే పరిష్కరిస్తాం: డీఈ

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ 42వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 160 కెవి ట్రాన్స్‌ఫార్మన్‌ను డీఈ మహేష్ ప్రారంభించారు. 42వ వార్డులో పర్యటించి కిందికి వేలాడుతున్న వైర్లను సరిచేయాలని సిబ్బందికి సూచించారు. వర్షా కాలం దృష్ట్యా విద్యుత్ సంబంధించి ఏలాంటి సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకవస్తే సమస్య ను పరిష్కరించడం జరుగుతుందన్నారు.వార్డు కౌన్సిలర్ కాటం శోభరాఘురామ్ మాట్లాడుతూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయడంతో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీ సుధాకర్‌రెడ్డి, ఏఈ రమేష్, విద్యుత్ సిబ్బంది రాజు,రాజిరెడ్డి, అశోక్,వార్డ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం మాటలు తప్ప చేతల్లో పనితనం చూపడం లేదు

**తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి**



: సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనాకర్‌రెడ్డి

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 4,ప్రభాతవార్త :** ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు కావస్తున్న నేటీ వరకు మాటలు తప్ప చేతల్లో పనితనం చూపడం లేదని ఒక్క డిఏ ప్రకటంచలేదని తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శిశు మందిర్‌లో జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన అభియాన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న డిఎలు చెల్లించాలన్నారు. పిఆర్‌సి ఇవ్వడానికి సైతం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. చాల యేండ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు నిర్వహించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హెల్త్ కార్డులు ఆసుపత్రుల్లో పని చేయడం లేదని ఉద్యోగులందరికీ నగదు రహిత వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేందర్‌రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు వైవి శశికుమార్,శ్రీనివాస్‌రెడ్డి, రామ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు లింగమూర్తి, వేణుగోపాల్,లోకేష్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు,కార్యదర్శులు వెంకట్‌రామ్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, రాములు, మల్లేశం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## పుష్పాంబరీ దేవిగా వనదుర్గా మాత

**పావన్నపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త:**



ఆషాడ మాసం చివరి ఆదివారం, అమావాస్య పర్వదినం కావడంతో ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు వేకువ జామున అభిషేకం చేసి పలు రకాల లక్ష పుష్పాలతో పుష్పాంజలి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు మొక్కు బడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీర పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు సమర్పించి ఒడిబియ్యం నింపి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటి ఛైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్, ఆలయ సిబ్బంది రవివీర్‌కుమార్, సూర్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

# స్వచ్ఛదనం..పచ్చదనం విజయవంతం చేయాలి

**రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్,ఆగస్టు 4,ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించేందుకు తలపెట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొన విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.ఆదివారం రోజున హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియో జకవర్గంలోని అన్ని మండలాలతో పాటు హుస్నాబాద్ మున్సి పాలిటీతో పాటు అన్ని గ్రామాలు చెత్తను తొలగించి,మొక్కలు నాటాలన్నారు.సీజనల్ వ్యాదులపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని,త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతీ గ్రామంలో ప్రజలకు వ్యక్తి గత శుభ్రతతో పాటు ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారులు పారిశుద్య పనులు చేపట్టాలని ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులతో పాటు యువ జన స్వచ్ఛంద సేవా సంస్థలు,ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు.వన మహోత్సవం కార్యక్రమం ద్వార ఖాళీ స్థలాలలో మొక్కలు నాటాలన్నారు. మానవ మనుగడకు పర్యావరణమే కీలకమని,పర్యావరణాన్ని కాపాడుకోవడానికి స్వచ్ఛందనం..పచ్ఛధనం కార్యక్రమం దోహదపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి మెంబర్ కేడం లింగమూర్తి,సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ,కౌన్సిలర్లు భూక్య సరోజున ,పున్న లావణ్యపది, వల్లపు రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల్లో నిధులు నిల్ గ్రామాల్లో పారిశుధ్యం ఫుల్

**దృష్టి సారించని ప్రత్యేక అధికారులు**




ముప్పారం గ్రామ పంచాయితీ కార్యాలయం (ఇన్‌సెట్‌లో అపరిశుభ్రం)

**అల్లాదుర్గం, ఆగస్టు 4, ప్రభాతవార్త:** గ్రామ పంచాయితీల్లో నిధులు లేకపవడంతో గ్రామాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్యంపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించకపోతుండటంతో గ్రామాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయని ప్రజలు మండిపడుతున్నారు. ఇందుకు సంబందించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండలంలో 16 గ్రామ పంచాయితీలు ఉండగా సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 7 నెలలు గడుస్తున్నా ఎన్నికల నిర్వహించకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది, కాని పంచాయితీలకు నిధులు కేటాయించకపోవడంతో ప్రత్యేక అధికారులు ప్రత్యేకంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు కాని, పారిశుద్య పనులు కాని చేపట్టడం లేదని, ప్రజలకు అధికారులు అందు బాటులో ఉండటం లేదని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీల్లో నిధులు లేనిదే తామెళ్లి చేసేదేమిటని అధికారులు అంటున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గొల్లకుంట గిరిజన పంచాయితీ తండాలో గత 2 నెలలుగా ట్రాక్టర్ మరమ్మత్తులకు నోచుకోక చెత్తను సేకరించలేకపోతుండటంతో తండా చెత్త కుప్పగా మారి గ్రామం మొత్తం దుర్గంధంలో దుర్వాసన వెదజల్లుతోందని తండా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో దోమల స్వైర విహారం విలయతాండవం చేస్తున్నాయి, సీజనల్ వ్యాధులకు ఎక్కడ గురవుతామో అన్న భయాందోళనలో మగ్గుతున్నామని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పంచాయితీలకు నిధులు మంజూరు కాగానే ట్రాక్టర్‌కు మరమ్మత్తులు చేయించి సమస్యలు పరిష్కరిస్తామని ఎంపిడివో శంకర్ ప్రభాతవార్తకు తెలిపారు.



ముస్లాపూర్‌లో మురుగుకాల్వలో పేరకుపోయిన మురుగునీరు



అల్లాదుర్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పేరుకుపోయిన చెత్తచెదారం

# అభ్యంతరాలు పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి

**హత్నూర ఆగస్టు 4,ప్రభాతవార్త:** గ్రామస్థుల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఇంచార్జి పంచాయతీ కార్యదర్శి పరిశ్రమకు ఎన్ఓసి ఇచ్చాడని హత్నూర మండలం చందాపూర్ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.అంతకు ముందు వరకు విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు ఇవ్వని ఎన్ఓసి ధృవపత్రాన్ని,స్వల్పకాలానికి ఇంచార్జిగా ఉన్న పంచాయతీ కార్యదర్శి ఇవ్వడంలోని అంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.మండలం పరిధిలోని తుర్కలఖనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓపరిశ్రమకు గ్యాస్ పైప్‌లైన్ వేయాల్సి ఉంది.అంతవరకు పైప్‌లైన్ వేయాలంటే, చందాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శివారు కొంతమేర వస్తోంది.తమ గ్రామపరిధిలో గ్యాస్‌పైప్‌లైన్ వేస్తే, ఎదైన జరగరానిది జరిగితే బాద్యులేవరని, ఆపరిశ్రమలో తమ గ్రామానికి చెందిన నిరుద్యోగులకు ఉపాది అవకశాలు ఇవ్వడంలేదని ఆరోపిస్తూ స్థానికులు కొందరు గ్యాస్‌పైప్‌లైన్ పనులను గతంలో ఆడ్డుకున్నారు.అప్పటి నుండి ఇప్పటి వరకు,గ్యాస్‌పైప్‌లైన్ పనులను మొదలు పెట్టలేదు.అప్పటి వరకు ఉన్న పంచాయతీ పాలకవర్గంకాని,వారి పదివి కాలం ముగిసిన తర్వాత, అప్పటి పంచాయతీ కార్యదర్శి గాని ఏలాంటి ధృవపత్రాలు ఇవ్వలేదు. గతనెలలో రెండు వారాల వరకు ఇంచార్జిగా పనిచేసిన పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌గౌడ్ ఎన్ఓసి ఇచ్చాడని గ్రామస్థులు కొందరు ఆరోపించారు.అధికారికంగా ఇంచార్జి బాద్యతలు అప్పగించక పోయినా, పూర్తి కాలం పంచాయతీ కార్యదర్శిహోదాలో అధికార దుర్వినియోగానికి దేవేందర్‌గౌడ్ పాల్పడ్డాడని గ్రామస్థులు ఆరోపించారు.స్వలాబాపేక్షతోనే అధికారదర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌గౌడ్‌పై విచారణ జరిగి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తూన్నారు.ఈవిజయమై హత్నూర ఎంపిడిఓ శంకర్‌ను వివరణ కోరగా పంచాపూర్ పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉన్నందున,గ్రామంలో పారిశుద్య సమస్యలు తలెత్తకుండా,సికిందాపూర్ పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌గౌడ్‌ను తారపూర్వకంగా కాకుండా, ఓరల్‌గా ఇంచార్జి బాధ్యతలు ఇవ్వడం జరిగిందని అన్నారు.పంచాయతీ కార్యదర్శి దేవేందర్ గౌడ్‌ను వివరణ కోరగా,తుర్కలఖనాపూర్‌పరిధిలోని కంపెనికి సంబందించిన లెటర్‌పై సంతకంపెట్టి ఇచ్చానని అన్నారు. 3లక్షల25వేల కట్టాలని పెర్కోన్నామని అన్నారు.అందులో 2లక్షల25వేల రిఫండబుల్, లక్షరుపాయలు నాన్‌రిఫండబుల్ ఉన్నాయని అన్నారు.ఇప్పటి వరకు ఇవ్వని ధృవపత్రాలు,తాత్కలికంగా వచ్చిన మీరుఏలా ఇచ్చారని ప్రశ్నిస్తే సరైనసమదానం రాలేదు.ఇంచార్జి బాద్యతలు తీసుకోవాలని హత్నూర ఎంపిడిఓ ఉత్తర్వులు ఇచ్చారని ఆయన అన్నారు.గ్యాస్‌పైప్‌లైన్ వద్దని గ్రామస్థులు రాతపూర్వకంగా పిర్యాదు ఇస్తే,నేను ఇచ్చిన లెటర్ తిరిగి తీసుకుంటానని బదులిచ్చారు.ఎంపిడిఓ,పంచాయతీ కార్యదర్శి విరుద్దమైన సమధనాలు ఇస్తుండటంలో అంతర్యఎమిటో పై అధికారులు తేల్చాల్సి ఉంది.దేవేందర్‌గౌడ్ ప్రస్తుతం మండలంలోని పంచాయతీ కార్యదర్శిగా ఉన్నాడు.

## హద్నూర్‌లో మహంకాళి మత బోనాల సందడి

**న్యాల్‌కల్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** ఆషాడి మాసంలో చివరి ఆదివారం మహంకాళి మాత అమ్మవారికి బోనాలు ఊరేగించడం మండలంలోని హద్నూర్ గ్రామంలోఆనవాయితీగా వస్తోంది. గత ఆదివారం గ్రామంలోని ఉరడమ్మకు బోనాలు సమర్పించగా ఈ ఆదివారం గ్రామంలోని శ్రీ మహంకాళి మాత అమ్మవారికి బోనాలను ఊరేగించారు. ఆలయాన్ని రంగు రంగు పేయింట్‌లతో, మామిడి తోరాణాలతో అందంగా ముస్తాబు చేశారు. శనివారం రాత్రికి ఆలయ ఆవరణలో మహంకాళి మాత ఒగ్గు కథను కళాకారులు వినిపించారు. ఆదివారం ఉదయం ఆలయానికి గ్రామానికి చెందిన హిందువులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాలను నివేదించారు. ఇండ్ల వద్ద మహిళలు బోనాలను సిద్ధం చేసుకోగా డప్పువాయిద్యాలతో చేరుకుని ఇండ్ల నుంచి బోనాలను గ్రామ కూడలికి చేరుకుని సామూహికంగా డప్పు వాయిద్యాల మద్య, పోతురాజుల విన్యాసాలు, యువకులు కేరింతలు కొడుతుండగా గ్రామంలోని పురవీధుల గుండా బోనాలను ఊరేగిస్తూ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్నదాన సౌకర్యాం కల్పించారు.



హద్నూర్‌లో మహంకాళి మాతకు బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

## అమావాస్య పూజలందుకున్న సంగమేశ్వరుడు

**ఝరాసంగం, ఆగస్టు 4, ప్రభాతవార్త:** ఆషాడ మాసం చివరి రోజు, అమావాస్య పర్వదినాన్ని పురష్కరించుకుని మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీదేవి సమేతంగా కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి శనివారం రాత్రికే పాదయాత్రగా చేరుకున్నారు. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో 100 రూపాయల ప్రత్యేక దర్శనానికి 3 నుంచ 4గంటల సమయం పట్టిందంటే ఆలయానికి భక్తుల తాకిడిపై ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆలయానికి చేరుకున్న భక్తులు అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో జంగమ స్వాముల వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని భక్తులు స్వీకరించారు.




మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

**హుస్నాబాద్ సిఐ కొండ్ర శ్రీనివాస్**

**హుస్నాబాద్,ఆగస్టు04,ప్రభాతవార్త** హుస్నాబాద్ సర్కిల్ పరిధిలో ప్రజలు ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ సిఐ కొండ్ర శ్రీనివాస్ హెచ్చరించారు.ఆదివారం రోజున మండలంలోని పోతారం (ఎస్) గ్రామాన్ని స్థానిక ఎస్ఐ తోట మహేష్‌తో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు ఈ గ్రామాల సందర్శన జరుగుతుందని,ఈ కార్యక్రమం ద్వార గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడి జీవితాలు నాషనం చేసుకుంటున్నారన్నారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా గంజాయి,మత్తు పదార్థాలు విక్రయించినా,సేవిస్తున్నట్లు తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.ప్రజలు,వ్యాపార్థులు,ప్రజా ప్రతినిధులు తమ గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని వీటిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.ఇటీవల రైతులకు రుణమాఫీ అయిన సందర్భంగా సైబర్ నేరగాల్లు ఫోన్లు చేస్తూ ఈకేవైపీ చేసుకోవాలని బ్యాంక్ వివరాలు తీసుకుని మోసం చేస్తున్నారని రుణమాఫీ విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్న వ్యవసాయశాఖ అధికారులతో పాటు నేరుగా బ్యాంకులకు వెళ్లి సమస్యలు పరిష్కరించుకోవాలని ఒక వేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.గ్రామాలలో అనుమాన స్పదంగా ఎవరు కనబడినా వెంటనే 100కు సమాచారం అందించాలన్నారు.ప్రజల సమస్యలు తీర్చేందుకు 24గంటలు అందుబాటులో ఉంటామన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ




పతకాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

**మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు4 ప్రభాతవార్త:** జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని రెన్‌జూకీ షోటోకాన్ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్ షైన్ షోటోకాన్ క్లబ్ వారు ఆదివారం రెండవ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌ను మనోహరాబాద్‌లోని శ్రీ శుభం ఫంక్షనన హాల్‌లో నిర్వహించినట్లు తెలిపారు. ఈ కారిటే పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవాతో పాటు సుమారు 10 రాష్ట్రాల నుండి 1500 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కరాటే పోటీల్లో రెన్‌జూకీ షోటోకాన్ మెదక్ విద్యార్థులు పథకాలు సాధించినట్లు తెలిపారు. గర్ల్స్ కటాస్ విభాగంలో సాన్విక, సుహానిక, పృథ్వీక, జయశ్రీ, పూజిత, విస్మయ, సాన్వికరెడ్డి, బాలుర విభాగంలో హార్దిక్, మోక్షిత్, సుధానష్, క్రిష్, సాయిచరణ్, అంకిత్, సూరజ్, కనిష్క చారి, సహస్ర వర్మ, అజిత్‌రాజ్, చైతన్య, అర్జున్, దేవాన్స్, శబరీస్, రోషన్‌లు మొత్తం 27 బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ పతకాలు సాధించిన విద్యార్థులు వారిని సినీ హీరో ఇంద్రసేన అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ దినకర్, రియాజ్, విద్యాసాగర్, నిఖిల్, నితన్యసిరి, అబ్దుల్లా, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**టేక్మాల్, ఆగస్టు 4 , ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టేక్మా ల్‌లో చదువుకున్న1998 బ్యాచ్ విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాభ్యాసం నేర్పిన ఉపాధ్యాయులు సుధాకర్,పిటీ శంకర్‌రెడ్డి గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైడ్ ఉపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతా శిఖరాలకు చేర్చాలన్న తపనతో విద్యా ర్థులకు విద్యాభ్యాసం చేశాం అందులో క్రమ శిక్షణతో కూడిన విద్యాను అందించే క్రమంలో దండన తప్పదన్నారు. విద్యార్థులందరు తమ పిల్లలాం టివారన్నారు. వారందరు ఉన్నత స్థానం కనబడితే మొదటగా అనంధిం చేది ఉపాధ్యాయులేనన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ వారు చేసిన అల్లరి పనులు, గురువులు విధించిన శిక్షలు,పాఠ్యాంశాల తీరును గుర్తుకు చేసుకుంటు పాత జ్ఞాపకాలను నేమరు వేసుకుంటు ఆనంధ డొలికల్లోనమునిగిపోయారు. మాకు విద్యాబుద్దులు నేర్పి ఉన్నతా శిఖరాల్లోన చేర్చిన మీ బోధన మరిచి పోలేమన్నారు. అనంతరం విద్యార్థులందరు వచ్చిన గురువులకు ఘనంగా సన్మానించ్చారు.

## ఘనంగా స్నేహితుల దినోత్సవం

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విక్టరీ టాకీస్ చౌరస్తాలో ఆదివారం సామాజిక కార్యకర్త గౌస్ బాబా ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్నేహితులు పాల్గొని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.స్నేహితులు అందరూ స్నేహిత బ్యాండ్ కట్టుకొని స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. స్నేహితం ఎప్పటికి ఇలాగే ఉండాలన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త గౌస్‌బాబా,రాజిరెడ్డి, గణేష్,శ్రీకాంత్, నర్సింలు,సంతోష్, సురేష్‌బాబు,రమేష్, సుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...**

క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రక్త సంబంధం కంటే స్నేహం చాల గొప్పదని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లింగ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో నందిని భగవాన్‌రెడ్డి, చాడ అశోక్‌రెడ్డి, శ్రీకాంత్, కల్లెపల్లి శ్రీనివాస్, ముంద్రాతి రమేష్,కొడిత్యాల శివకుమార్,కొత్త శ్రీనివాసులు తదితరులు పాల్గన్నారు.

# చెట్టును ఢీకొన్న కారు.. ముగ్గురు యువకులు దుర్మరణం

**మరో యువకుడికి స్వల్పగాయాలు**
**శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ఘటన**

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన శ్రీశైలం ఘాటీరోడ్డు వద్ద శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయం నిండిపోవడంతో, అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువ ఉన్న నాగార్జున సాగర్‌లోకి విడుదల చేయగా, డ్యామ్ గేట్ల నుంచి దూకుతున్న కృష్ణమ్మను చూడ డానికి రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు క్యూ కట్టారు.

గత రెండు రోజుల నుంచి హైద రాబాద్, శ్రీశైలం జాతీయ రహదారి వద్ద పలు చోట్ల వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోతు న్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని బొల్లారం ప్రాంతానికి చెందిన మాచర్ల కిషన్ కన్నయ్య(22) ముగ్గురు స్నేహితులతో ప్రకృతి అందాలను వీక్షించడానికి వెళ్లి, శ్రీశైలం ఘాట్ రోడ్డు వద్ద కారు ప్రమాదానికి గురయ్యారు. శని వారం అర్ధరాత్రి సమయంలో నాగర్ కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ దోమలపెంట ప్రాంతం వద్ద ఘాట్‌రోడ్డు మీద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిషన్ కన్నయ్యతో పాటు మరో ఇద్దరు యువకులు మృతి చెందగా, కొంపల్లికి చెందిన సాయి ప్రకాశ్ తీవ్ర గాయాలతో బయట పడ్డారు.

స్థానికుల సాయంతో పోలీసులు గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం నంద్యాల జిల్లా సున్ని పెంట ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. ప్రస్తుత సమయంలో అధికంగా ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో యాత్రికులు శ్రీశైలం వెళ్ళడం తగ్గిస్తే మంచిదని పోలీసులు, అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# సంఘ సేవకురాలు అరిగపూడి కృష్ణకుమారి సంస్మరణ సభ

**చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:** ప్రముఖ సంఘసేవకురాలు అరిగపూడి కృష్ణకుమారి సంస్మరణ సభ ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముందుగా కృష్ణకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం నివాళులు అర్పించే కార్యక్రమం జరిగింది. కళావిఎస్.జనార్దనమూర్తి మాట్లాడుతూ కళా సంస్థలకు, పేదలకు సేవచేయడంతో అరిగపూడి విజయకుమార్-కృష్ణకుమారి దంపతులు చేసిన సేవ ఎంతో గొప్పదన్నారు. ముఖ్యంగా త్యాగరాయ గాన సభకు వీరువురుచేసిన సేవ తాము ఎన్నటికి మరిచిపోమని అన్నారు. విజయ కుమార్ భార్య కృష్ణకుమారి ఆరు నెలలుగా కోమాలో ఉన్నా కూడా ఆత్మ విశ్వాసంతో ఆయన చేసిన సేవ ఎంతో గొప్పదన్నారు.

కొన్ని వందల సాంస్కృ తిక సంస్థలు నేడు నిర్విరామంగా కార్యక్రమాలు నిర్వహించుకుంటు ముందుకు సాగుతున్నాయంటే అందుకు ప్రధాన కారణంగా డాక్టర్ అరిగపూడి విజయ కుమార్ సహాయం మాత్రమేనని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అరిగ పూడి విజయకుమార్ నుంచి సహాయం పొందని సాంస్కృతిక సంస్థ లేదని అన్నారు. అరిగపూడి విజయకుమార్ దాతృత్వం ఎంతో గొప్పదన్నారు. ఈ సభలో ప్రముఖ పారిశ్రామికవేత్త, అరిగపూడి కృష్ణకుమారి భర్త అరిగపూడి విజయకుమార్, కుమారుడు సుమిత్‌తో ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావిఎస్.జనార్దనమూర్తి మాట్లాడుతూ కార్యక్రమంలో వంశీ రామరాజు, మద్దాళి రఘురామ్, మాస్టార్జీ, రవి, శ్రీరామ్‌వత్తి, గాయకుడు దుర్గాప్రసాద్, ఎస్.బి.సుధాకర్, రమేశ్, వైఎస్.రామకృష్ణ, గిరి, లలిత, మల్లెల వసుంధ, సుజా రమణ, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

**రాచకొండ సిపి సుధీర్‌బాబు**



మాట్లాడుతున్న రాచకొండ సిపి సుధీర్‌బాబు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** విదినిర్వహణ పట్ల పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సిపి సుధీర్‌బాబు సూచించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసుస్టేషన్లలో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడంలో భాగంగా శనివారం రాత్రి సిపి సుధీర్‌బాబు చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ సిబ్బంది వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాలలో సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎల్‌బినగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, సిఐ వెంకటేశ్వర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**పుష్పగిరి పీఠాధిపతి చేతులమీదుగా**

## పండిత పురస్కారాలు ప్రదానం : రమణాచారి

**రవీంద్రభారతి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** జగద్గురువులు పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకరభారతీస్వామివారి కరకమలాలమీదుగా పండిత పుస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి రెడ్‌హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాకు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తిరుమల ఛారిటబుల్ ట్రస్ట్, సాధన సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నేడు 5 సోమవారం రాత్రి 6గంటల నుండి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి సభాధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ విద్యాశంకరభారతి స్వామిజీ వేంచేసి సభాప్రారంభకుడు డా. కె.వి.రమణాచారి, విశిష్ట అతిథులు డా. మామిడి హరికృష్ణ, సిహెచ్.లక్ష్మీనాథాచార్యులు తదితరులతో కలిసి శ్రీవేదాంత దేశిక సాహితీ వ్యాఖ్యాత శిరోమణి వాచస్పతి మహోపాధ్యాయులు కె.వి.రాఘవాచార్యులు స్మారక పండిత పురస్కారాన్ని సంస్కృతాంధ్ర పండిత శిరోమణి పాలెం ప్రాచ్యకళాశాల పూర్వ ప్రధానాచార్యుడు డా. పెరుంబుదూరు శ్రీరంగాచార్యులుకు; చైతన్యశీలి డా. కె.వి. రమణాచార్య స్ఫూర్తి పురస్కారాన్ని ప్రముఖ విద్యావేత్త భాష్యం శ్రావణకుమార్‌కు ప్రదానం చేయనున్నట్లు డా. కె.వి.రమణాచారి వివరించారు.

## అధ్యక్ష పదవిపై అనవసరపు ఆరోపణలు తగవు

**-అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్**



తన నియాకమపత్రం చూపుతున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్, ఆగస్టు 4,ప్రభాతవార్త:** అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్ష పదవిపై అనవసరపు ఆరోపణలు తగవని నూతనంగా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గడ్డం శ్రీనివాసయాదవ్ స్పష్టం చేశారు. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ మహాసభ జాతీయ అధ్యక్షులు సెల్వం చేతులమీదుగా గత నెల 23న తాను నియమాకపత్రం అందుకున్నట్లు తెలిపారు. నిన్న మొన్నటి వరకు కొనసాగిన పాతకమిటీ ఉద్దేశ్యపూర్వకంగా తనపై దుష్ప్రచారం చేయడం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. సామాజిక వర్గప్రజలకు సేవ చేసేందుకు మాత్రమే తాను ఈపదవిని తీసుకున్నట్లు చెప్పారు. అధ్యక్ష పదవిపై ఆక్షేపణలు ఉంటే జాతీయ నాయకత్వాన్ని సంప్రదించాలని లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించినా తనకు అభ్యంతరం లేదన్నారు. కానీ అనవసర ఆరోపణలు మానుకోవలన్నారు. అలాగే ఈనెల 8న ఢిల్లీలో జాతీయ కమిటీ ఆధ్వర్యంలో కొత్తగా ఎంపికైన ఎంపిలందరికీ సన్మాన కార్యక్రమం జరుగుతుందని దీనికి సమాజ్‌వాదిపార్టీ అధినేత అఖిలేష్‌యాదవ్ ముఖ్యఅతిధిగా హారవుతారన్నారు. ఈకార్యక్రమంలో గడ్డం చిన్నశ్రీనివాస్‌యాదవ్, ఆనంద్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## వాహనంతో ఢీ... గుర్తు తెలియని వ్యక్తులు దాడి

**వ్యక్తికి గాయాలు**



**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తులు వాహనంతో ఇక వ్యక్తిని ఢీ కొట్టి, అతడిపై దాడి చేయగా, ప్రాణాపాయ స్థితిలో బాధితుడు ఉస్మానియా ఆసుపత్రిలో చేరిన ఘటన ఆదివారం ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ జి.వెంకటేశ్వరులు తెలిపిన వివరాల ప్రకారం, ఆసిఫ్‌నగర్‌లో నివాసముండే అమీర్ ఖాన్(26) భార్య, ఇద్దరు సంతానంతో కలిసి నివసిస్తూ, అదే ప్రాంతంలో ఫర్నీచర్ పనులు చేస్తున్నాడు. కాగా గత 3రోజుల క్రితం భార్యతో గొడవ పడి ఆమెను కొట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి 10:30 గంటల సమయంలో చంద్రభవన్ నాలుగు రోడ్ల జంక్షన్‌లో మద్యం సేవించి వెళ్తుండగా, గుర్తు తెలియని దుండుగలు హఠాత్తుగా అతడిని తమ వాహనంతో ఢీకొట్టి, అనంతరం అతడిపై దాడికి పాల్పడ్డారు. మూకుమ్మడిగా పిడిగుద్దులు గుద్దడంతో బాధితుడి చెవిలోంచి రక్తం కారగా ఘటనా స్థలంలో అతడు స్పృహతప్పి పడిపోయాడు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న ఆసిఫ్‌నగర్ పోలీసులు దెబ్బలతో పడున్న అమీర్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తన భార్యను కొట్టినందుకు అత్తింటి వారే తనపై దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# గుంతలు కానరాలేదా..?

**నరకానికి నకళ్లు.. నగర రహదారులు..**
**వానొస్తే చెరువులు, గుంతలు**
**ప్రమాదాల పాలవుతున్న వాహనదారులు**



బర్కత్‌పురలో...

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త**

సంతోష్ బోడుప్పల్ నివాసి. ఆదివారం తన భార్య భానుతో కలిసి రామంతాపూర్‌కు వెళ్తుండగా ఉప్పల్‌లో రోడ్డుపై గుంతలతో అదుపుతప్పి భార్యభర్తల్లిద్దరూ కింద పడ్డారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చేరారు. నగరంలో రహదారుల దుస్థితికి అద్దంపడుతున్నాయి. ప్రజలు ఇలా ప్రతిరోజూ ప్రమాదాలబారిన పడుతున్నారు. గ్రేటర్ నగరంలో రహదారులు బాగుపడ్డాయని అధికారులు చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వానొస్తే రోడ్లు చెరువులుగా మారే పరిస్థితి తప్పడంలేదు. వాన వెలిశాక అడుగడుగునా గుంతలతో పడకుండా వాహనాన్ని సడన్‌గా పక్కకు తప్పించబోయి కిందపడి తీవ్ర గాయాలు అవుతుండటం. అడపాదడపా ప్రాణాలు పోవడం పరిపాటిగా మారింది.

**నగరంలో ఎక్కడ చూసినా..**

గ్రేటర్‌లో 9 వేల కిలోమీటర్లకు పైగా రోడ్లున్నాయి. వాటిలో దాదాపు 900 రోడ్ల నిర్మాణం, నిర్వహణను అయిదేళ్ల పాటు సీఆర్ఎంపీ కింద జీహెచ్ఎంసీ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించింది. ఈ పథకం కింద చేసిన పనులకు కాంట్రాక్టు ఏజేన్సీలకు ఇప్పటి వరకు దాదాపు. రూ.1200 కోట్లవరకు చెల్లింపులు జరిగాయి. ఒప్పందం మేరకు, రోడ్లకు గుంతలు పడ్డా, ఇరవై నాలుగ్గంటల్లో పూడ్చివేయాలి. కానీ అది జరగడంలేదు. ఇది ప్రధాన రహదారుల్లోని పరిస్థితి కాగా, సీఆర్ఎంపీయేతర రహదారులు, కాలనీలు, బస్తీల్లోని రోడ్ల పరిస్థితులు పరమ అధ్వానంగా ఉన్నాయి. వానొస్తే చాలు బురద గుంతలుగా మారుతుండటంతో ప్రయాణానికి ఆటంకాలుగా మారాయి. అక్కడా ఇక్కడా అని కాదు నగరంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. ఎల్‌బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్, సికింద్రాబాద్, చాంద్రాయణగుట్ట, మలక్‌పేట, రామ్‌నగర్, అంబర్‌పేట, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కార్వాన్, బేగంబజార్‌తో పాటు నగర శివారు మున్సిపాలిటీలు బోడుప్పల్, ఫిర్జాదిగూడ, దుండిగల్ మున్సిపాలిటీల్లో ఎటు చూసినా ఇదే దుస్థితి. ఉప్పల్-మేడిపల్లి రోడ్డు, అంబర్‌పేటల్లో కొనసాగుతున్న ఎలివేటెడ్ బ్రిడ్జిల పనులతో అధ్వానపు రోడ్లతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు.

**అడుగడుగునా గుంతలు..**

ఇటీవల వర్షాలు కురిసిన పదిరోజుల్లో రోజుకు కనీసం 250 నీరునిలిచిన ఫిర్యాదులందాయి. అందని ఫిర్యాదులు ఇంకా రెట్టింపే ఉంటాయి. నీరు నిలిచిన పలు ప్రాంతాలు గుంతలుపడి, కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. జీహెచ్ఎంసీ రోడ్ల నిర్మాణం, నిర్వహణ పనుల కోసం ఏటా వందల కోట్లు ఖర్చు చేస్తున్నా.. మూడు విభాగాల ద్వారా క్వాలిటీ పరీక్షలు జరుగుతున్నా పరిస్థితులు మారడంలేదు.



**ఇష్టానుసారంగా తవ్వకాలు..**

ఇందుకు ప్రధాన కారణం అనుమతులున్నా లేకున్నా అడ్డగోలుగా రోడ్లను తవ్వడం. వివిధ అవసరాల కోసమంటూ రోడ్లను తవ్వుతున్నారు. పనులు ఆపడానికి వీలులేని అత్యవసరమైన తాగునీరు, డ్రైనేజీల పేరిట వర్షాకాలంలోనూ రోడ్లు తవ్వుతున్నారు. ఇక విద్యుత్, టెలికాం సంస్థలు సైతం రోడ్లను తవ్వుతూనే ఉన్నాయి. దొంగచాటుగా రాత్రివేళల్లో సైతం రోడ్లు తవ్వుతున్నారు. వర్షాలకు పడే గుంతలతో పాటు ఈ తవ్వకాల వలన్ల మరింత ప్రమాదకర పరిస్థితులేర్పడుతున్నాయి. మరోవైపు జీహెచ్ఎంసీ ఇతర ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపంతోనూ సమస్యలు తలెత్తుతున్నాయి.

**నిధులు ఖర్చు చేస్తున్నా..**

గత సంవత్సరం దాదాపు రూ.1273 కోట్ల అంచనా వ్యయంతో 4790 రోడ్ల పనుల్ని చేపట్టారు. వాటిలో 2500 పూర్తయ్యాయి. అందుకు రూ.700 కోట్లు ఖర్చయింది. ఈ సంవత్సరం సైతం సీఆర్ఎంపీ మార్గాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో దాదాపు రూ.600 కోట్ల అంచనా వ్యయంతో 2500 పనులు చేపట్టినప్పటికీ, సకాలంలో బిల్లులు చెల్లించడం లేదనే కారణంతో పనులు కుంటుతున్నాయి. వర్షాలొస్తే గుంతల పూడ్చివేతల పేరిట దాదాపు రూ.20 కోట్లు, ప్యాచ్‌వర్క్స్ పేరిట దాదాపు రూ.150 కోట్లు ఖర్చు చేస్తున్నారు. గడచిన నాలుగైదేళ్లలో రోడ్ల నిర్మాణం, నిర్వహణల పేరిట దాదాపు రూ.2500 కోట్లు ఖర్చు చేశారు.

**తిప్పలు తప్పించండి.. బీజేపి నగర కమిటీ డిమాండ్..**

రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాల గుర్తింపు తదితర అంశాల్లో జీహెచ్ఎంసీ విఫలమైందని, దాంతో వర్షాలు వెలిశాక సైతం ప్రజలకు తిప్పలు తప్పడంలేదని బీజేపి కార్పొరేటర్లు పేర్కొంటున్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఇటీవల మున్సిపల్, జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటర్ లాగింగ్స్, నాలాల డీసిల్టింగ్, రోడ్ల మరమ్మతులకు సంబంధించి తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. సీఆర్ఎంపీ రోడ్లకు, కాలనీల్లోని అప్రోచ్ రోడ్లతో కనెక్టివిటీ లేకపోవడంతో పరిస్థితులు పరమదుర్భరంగా మారాయన్నారు. సీఆర్ఎంపీ పనుల్లో నిధుల చెల్లింపులపై విచారణ జరపాలని కోరారు.

# సంగీతం వింటే ఆరోగ్యంగా ఉండవచ్చు

**-తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి**



జస్టిస్ రాధారాణి దంపతులను సత్కరిస్తున్న ఎల్.వి.చెన్నారావు తదితరులు

**చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:** సంగీతం మనసును తెలియకపరచడమే కాదు, అనారోగ్యంతో బాధపడుతున్నవారిని కోలుకునేలా చేస్తుందని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పద్మ విభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ 94వ జయంతి మహోత్సవం జాతీయ వాయిద్య కళాకారుల సంఘం, రాగవర్ధిని కల్చరల్ సొసైటీ సౌజన్యంతో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ రాధారాణి హాజరై జ్యోతిని వెలిగించి ప్రారంభించి ప్రసంగించారు. సంగీతానికి మన భావోద్వేగాలు, ప్రవర్తన, సంభాషణ తదితరాలపై సానుకూల ప్రభావం చూపేశక్తి ఉందన్నారు. ప్రతి ఒక్కరు కాస్త ఆనందంగా, రిలాక్సింగ్‌గా ఉండగలుగుతామని, ఏరకంగా చూసుకున్నా మ్యూజిక్ థెరఫీ అనేది జీవితంపై చాలా సానుకూల ప్రభావాలను చూపిస్తుందని, ప్రతి విషయానికి ఎక్కువగా భయపడిపోవడం, కంగార పడిపోవడం, పని చేయాలంటే కంగారు వచ్చేసి సవ్యంగా చేయలేక పోవడం,అతిగా వత్తిడికి గురికావడంలాంటి లక్షణాలు అన్నింటిని తగ్గించడంలో సంగీతం వినడం వల్ల ఎన్నో తిరిగి అరోగ్యంగా ఉన్నసందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. సంగీతానికి ఘనంగా నిర్వహించబోతున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు ఎల్‌వి.చెన్నారావు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుప్రసిద్ధ కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వాంసులు, కళారత్న డి.వి.మోహన కృష్ణ ఆధ్వర్యంలో బాలమురళీ గానరవళి సంగీత, సాంస్కృతిక మధుర గీతాలపన అద్భుతంగా సాగింది. విశ్రాంత అదనపు రవాణా కమిషనర్ సిఎల్ఎన్.గాంధీ, ఆలిండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ విష్ణుభట్ల ఉదయశంకర్, తిరుపతి ఎస్వీ.నాదస్వర పాఠశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వి. సత్యనారాయణ, ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్ర రత్న, డాక్టర్ ఎం.ప్రభాకరరావు, పాత్రికేయులు ఎస్.వినయకుమార్, ప్రముఖ వైద్యులు డాక్టర్ రంగయ్య, వంశీ రామరాజు, జాతీయ వాద్య కళాకారుల సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కె.నర్సింహారావు, ఎల్.వెంకటరమణ, తెలంగాణ సంఘం కోశాధికారి వేముల శ్రీనివాసరావు, మహిళా సంఘం ప్రతినిధి ఎస్.మీరాబి, సంగీత దర్శకులు డాక్టర్ ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడ్ వసూళ్లు..!

* లైసెన్స్‌ల పేరిట సిబ్బంది చేతివాటం..
* తక్షణ ఆమోదం అవకాశమున్నా.. మారని తీరు
* వ్యాపారులకు అవగాహన కల్పించని జిహెచ్ఎంసి..

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** అంబర్‌పేటలో చిరు దుకాణం వద్దకు వెళ్లిన జీహెచ్ఎంసీ ఉద్యోగి.. ట్రేడ్ లైసెన్స్ ఉందా..? అని అడిగాడు. లేదని చెప్పడంతో వెంటనే తీసుకోవాలి.. పై అధికారులకు తెలిస్తే పెనాల్టీ వేస్తారని భయపెట్టాడు. ఆధార్‌కార్డు, రెంటల్ అగ్రిమెంట్, ఇతర పత్రాలు ఇస్తే ఒక్కరోజులో సర్టిఫికెట్ తీసుకొస్తానని చెప్పాడు. అందుకు రూ. 3,500 ఖర్చవుతుందని తీసుకున్నాడు. సర్టిఫికెట్‌లో మాత్రం చెల్లించిన రుసుము రూ. 1100గా ఉంది.

ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఓ సర్కిల్‌లో కిరాణ షాపునకు వెళ్లిన సిబ్బంది ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించి.. నిషేధిత ప్లాస్టిక్ ఎలా విక్రయిస్తున్నారని భయపెట్టారు. దీంతో రూ.5 వేలు ముట్టచెప్పిన దుకాణ యజమాని ట్రేడ్ లైసెన్స్ కోసం మరో రూ.3వేలు ఇచ్చాడు.

పారదర్శక పౌరసేవల్లో భాగంగా ట్రేడ్ లైసెన్స్ ఇన్‌స్టంట్ అప్రూవల్ విధానాన్ని జీహెచ్ఎంసీ అమలులోకి తీసుకొచ్చింది. అవసరమైన పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేసి నిర్ణీత రుసుము చెల్లిస్తే.. సర్టిఫికెట్ తీసుకోవచ్చు. ఈ విషయంపై మెజార్టీ పౌరులకు అవగాహన లేదు. వారికి తెలియజేయాలనే విషయంపైన అధికారులు దృష్టి సారించలేదు. దీంతో క్షేత్రస్థాయి సిబ్బంది రెచ్చిపోతున్నారు. ఇదే అదనుగా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాస్తవ రుసుముకు మూడు నాలుగింతలు వసూలు చేస్తూ సామాన్యులను దోచుకుంటున్నారు. గ్రేటర్‌లో ఏ తరహా వ్యాపారం చేయాలన్నా... జీహెచ్ఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. వ్యాపారం కేటగిరీ, దుకాణం, వాణిజ్య సుదాయం విస్తీర్ణం ఆధారంగా రుసుము నిర్ధారిస్తారు. బల్దియాల్లో ప్రస్తుతం 94 వవేలకు పైగా ట్రేడ్ లైసెన్సులున్నాయి. వాస్తవంగా గ్రేటర్‌లో ఐదు లక్షల వరకు వివిధ రకాల వ్యాపార సంస్థలు ఉన్నాయని అంచనా. అందులో నాలుగోవంతు కూడా ట్రేడ్ లైసెన్స్‌లు లేవు. ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బంది అవినీతి కారణమని గుర్తించారు.

లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరాన్ని వ్యాపారులకు వివరించకుండా.. అంతా మేం చూసుకుంటామంటూ వసూళ్లకు పాల్పడ్డారన్న ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు.. తక్షణ అమోదం విధానం అందుబాటు లోకి తీసుకవచ్చారు. అయినా సిబ్బంది చేతివాటం మానలేదు. సాంకేతికతను తమకు అనుకూలంగా మార్చుకొని గతంకంటే ఎక్కువ అక్రమార్జన పొందుతుండడం గమనార్హం.

**ఉన్నతాధికారులూ...**

అంతకుముందు ఆన్‌లైన్, మాన్యువల్‌గా ట్రేడ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేస్తే.. ట్రేడ్ కేటగిరీని బట్టి డిప్యూటీ మున్సిపల్‌కమిషనర్, జోనల్ కమిషనర్ ఆమోదం అనంతరం సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఈ క్రమంలో పై అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందంటూ సిబ్బంది వ్యాపారుల వదనద రుసుము కంటే అదనంగా వసూలు చేశారు. కొత్త విధానం అమలుతో అధికారుల ఆమోదం అవసరంలేదు. అయినా కొందరు సిబ్బంది అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందంటు వసూళ్లకు పాల్పడుతున్నారు. చాలామంది వ్యాపారులకు ఆన్‌లైన్‌లో ట్రేడ్ లైసెన్స్ తీసుకునే వెసులుబాటు ఉన్న విషయం తెలియదు.

దీంతో సిబ్బంది చెప్పినంత ముట్టచెప్పి లైసెన్స్ తీసుకుంటున్నారు. ట్రేడ్ లైసెన్స్‌ల సంఖ్య పెంచేం దుకు గతంలో జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో పాటు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లకు పరిశీలన బాధ్యతలు అప్పగించారు. ఈ సమయంలోనూ భారీగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికీ కొందరు ఉద్యోగులు దుకాణాల వద్దకు వెళ్లి లైసెన్స్ తీసుకోవాలని సూచిస్తూ.. తామే అన్ని చూసుకుంటామని అధిక వసూళ్లు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటామని అవగాహన ఉన్న ఎవరైనా చెప్పినా మీది ఏ వ్యాపారం..? ఏమేం అమ్ముతున్నారు..? ప్లాస్టిక్ విక్రయిస్తున్నారా..? అని ఆరా తీసి పరోక్షంగా భయపెడుతున్నారు. కొందరు లైసెన్స్ ఆఫీసర్లు, ఏఎంఓహెచ్‌ల తీరుపైనా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతినెల ఇంత ఇవ్వాలని సిబ్బందికి టార్గెట్ పెట్టి మరీ వేధిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని ఓ ఏఎంహెచ్ తీరు అంతే.

జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ నుంచి ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, వాణిజ్య సముదాయాల నుంచి గార్బేజ్ కలెక్షన్ వరకు యధేచ్ఛగా వసూళ్లుచేస్తాడని సమాచారం.

**బేగంపేట పి అండ్ టి ఫ్లై ఓవర్‌పై**

## కారులో మంటలు....

**బేగంపేట ఆగస్టు 4, ప్రభాతవార్త :** విధులు ముగించుకుని కారులో ఇంటికి వెళుతున్న భార్య భర్తలు ఒక్క సారిగా కారు బానెట్ నుంచి పొగలు రావడం గమనించి కారును పక్కకు నిలిపివేసి డయల్ 100కు సమాచారం అందించారు. అయితే ఈ ప్రమాదంలో కారు పాక్షికంగా దగ్గం కాగా ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ సీ ఎల్ దమ్మాయిగూడాకు చెందిన డి.రవీందర్ ఆయన సతీమణి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఉన్నారు. వీరు ఎప్పటిలాగానే విధులు ముగించుకుని నిజాంపేట నుంచి దమ్మాయిగూడాకు తమ కారులో బయలు దేరారు. కారు బేగంపేట పీ అండ్ టీ ఫ్లై ఓవర్ పైకి చేరుకున్న సమయంలో వారు కారు బానెట్ నుంచి పొగలు రావడాన్ని గమనించారు. వెంటనే కారు దిగి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి కారుకు అంటుకున్న మంటలను ఆర్పివేసారు. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగనప్పటికీ కారు పాక్షికంగా కాలిపోయింది. దీంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన ఫ్లై ఓవర్‌పైన జరగడంతో ఆ సమయంలో ట్రాఫిక్ కు కొంత అంతరాయం ఏర్పడింది. అనంతరం ట్రాఫిక్ యధావిధిగా కొనసాగింది.

## యువతిని నిర్భందించి అత్యాచారం..కేసు నమోదు

**బేగంపేట ఆగస్టు 4,ప్రబాతవార్త :** పెళ్లి చేసుకుంటానంటూ ఓ యువతిని నమ్మించిన ప్రబుద్ధుడు ఆమెను నిర్భంధించి అత్యాచారానికి పాల్పడిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లాకు చెందిన యువతి (34) వెంగళరావునగర్ ప్రాంతంలో నివాసం ఉంటూ బేగంపేటలోని ఓ ఐటీ శిక్షణా సంస్థలో హెచ్ఆర్ శిక్షణా తరగతులకు హాజరవుతుంది. ఆమె శిక్షణ పొందుతున్న సంస్థలోనే శిక్షణ పొందుతున్న కె.వి.సంతోష్ చైతన్య శిక్షణ పొందుతున్నాడు. బాధితురాలు తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో వర్షం వచ్చిన సమయంలో ఇల్లు కురుస్తుండటంతో బేగంపేట ప్రాంతంలో మరో ఇంటికోసం వెతుకుతుంది. అయితే తాను తన తల్లీ, సోదరిల సహాయంతో అద్దె ఇల్లు చూపిస్తానంటూ సహచరుడైన సంతోష్‌చైతన్య యువతిని మాయమాటలతో నమ్మించాడు. అతని మాటలు నమ్మిన బాధితురాలు ఈ ఏడాది జూన్ 5వ తేదీన ప్రకాశ్‌నగర్ ప్రాంతంలోని సంతోష్ చైతన్య ఇంటికి వెళ్లింది. అక్కడ సంతోష్ చైతన్య చెప్పినట్లుగా అతని తల్లీ,సోదరీ ఎవరూ లేకపోవడంతో వారెక్కడున్నారంటూ యువతి అతన్ని ప్రశ్నించింది.

అయితే అతను సమాధానం చెప్పకుండా ఆమెను ఇంట్లోకి తీసుకుని వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకుంటానని బాధితురాలికి మాయమాటలు చెప్పి నమ్మించి ఐదు రోజుల పాటు తన ఇంట్లోనే ఉంచుకున్నాడు. ఆ తరువాత పెళ్లి గురించి యువతి గట్టిగా నిలదీసి ప్రశ్నించడంతో తప్పించుకుని తిరగసాగాడు. బాధితురాలు జులై 11న షీటీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. షీటీమ్ పోలీసులతో కూడా తాను పెళ్లి చేసుకోనని చెప్పాడు. షీటీమ్స్ పోలీసులు కేసును బేగంపేట పోలీసులకు బదిలీ చేసారు. బేగంపేట పోలీసుల ముందు మరుసటి రోజు యువతిని పెళ్లి చేసుకుంటానని లిఖిత పూర్వకంగా రాసిచ్చాడు. అనంతరం అక్కడి నుంచి బయటపడి కనిపించకుండా పోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి అదృశ్యం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ యువకుడు అదృష్టమయ్యాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగోల్ డివిజన్ సాయినగర్‌కాలనీలో నివాసం ఉండే కైరంకొండ మాలతి కుమారుడు షేర్ మార్కెట్ ట్రేడింగ్ చేసే వివేక్(30) ఈనెల రెండవ తేదీన రాత్రి 8 గంటలకు కొత్తపేటలోని స్నేహితుని కలవడానికి ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు. బంధువులు, స్నేహితుల వద్ద విచారణ జరిపిన దిరకకపోవడంతో మాలతి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాలతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



నల్లపోచమ్మ ఆలయంలో పూజలుచేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా, సుభిక్షంగా జీవించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్, బాలంరాయి, మహేంద్రహిల్స్, బొల్లారం పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల నిర్వాహకులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్, బద్రినాథ్‌యాదవ్, ఆర్.డి.నాగేష్ యాదవ్, సదానంద్ గౌడ్, ముప్పిడి మధుకర్, బస్తీ నాయకులు పంగ రాజయ్య, డి.బాబురావ్, రౌతు రాజయ్య, పరశరాములు, నర్సింగ్, కంసాని బాబు, శివకుమార్ పాల్గొన్నారు.

## మహేంద్రహిల్స్‌లో ఘనంగా బోనాల వేడుకలు



పూజలు చేస్తున్న కంటోన్మెంట్ బోర్డు మెంబర్ రామక్రిష్ణ తదితరులు

**కంటోన్మెంట్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం మహేంద్రహిల్స్‌లోని శ్రీమహాకాలి వనదుర్గ శ్రీ రాజరాజేశ్వరీ సమేత దేవాలయం, దేవాలయ నిర్వాహకులు,ఉజ్జయిని మహాకాలి ఆలయ వేద పండితులు వేణుమాధవశర్మ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బోనం వేడుకలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేషుష్,బోర్డు మెంబర్‌జె. రామక్రిష్ణలతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ల, బ్యాండ్ వాయిద్యాల మధ్య శివసత్తులు, పోతరాజుల విన్యాసాలతో బోనాల వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వేలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అంబేద్కర్ నగర్‌లో ఘనంగా బోనాల వేడుకలు



బోనాలవేడుకలో పూజలుచేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్, ఆగస్టు4 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్ అంబేద కర్ నగర్‌లోని శ్రీనల్లపోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు చిన్న వీరయ్య, నాగేశ్, బాలమల్లు యాదవ్,కొంత నరేశ్ పాల్గొన్నారు.

## బోనాల వేడుకల్లో పాల్గొన్న ఆదం సంతోష్



ఎల్లమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న సికింద్రాబాద్ ఆదం సంతోష్

**అడ్డగుట్ట, ఆగస్టు 4 ప్రభాతవార్త:** ఈస్ట్ మారేడ్‌పల్లి వడ్డెర బస్తీలో ప్రసిద్ధిగాంచిన శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం జరిగిన బోనాల వేడుకలకు సికింద్రాబాద్ అసెంబ్లీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను ఆలయ నిర్వాహకులు దండుగుల వెంకట స్వామి, వడ్డెర మోహన్‌లు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాండియ సందీప్, గంట రాజు సాగర్, బిఆర్ఎస్ నాయకులు పెండెం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వార్ధం లేనిది స్నేహ బంధం : జంపన ప్రతాప్



స్నేహితులతో కేక్‌కట్ చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం, బోనాల వేడుకలు, అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం కంటోన్మెంట్ లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకలకు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్ధం లేని స్వచ్ఛమైనది స్నేహమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానుక మల్లిఖార్జున్, మల్యాద్రి, బాణాల శ్రీనివాస్ రెడ్డి, అజిత్, దుర్గయ్య, సాయిబాబా యాదవ్, షకీబ్, మోహన్, రాజు, టింకూగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కురుమల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ : తాండ్ర రమేష్

**నార్సింగి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** కురుమల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కురుమ సంఘం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ అధ్యక్షులు తాండ్ర రమేష్ కుమార్ తెలిపారు. ఆదివారం బండ్లగూడలోని సంధ్యానగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కురుమ సంఘాన్ని బలోపేతం చేసేందుకు, కొత్త సభ్యులను చేర్చుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. కురుమలను విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో బలోపేతం చేసేందుకు సంఘం నిరంతరం పనిచేస్తుందన్నారు. పేద కురుమల విద్యాభివృద్ధికి సంఘం చేయూతనిస్తుందన్నారు. సామాజిక సేవలు అందించేందుకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. కార్పోరేషన్‌పరిధిలో నివసిస్తున్న ప్రతీ కురుమ కుటుంబాన్ని కలిసి, సభ్యత్వంను ఇస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు నరేష్, మల్లేష్, రమేష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, విఠలయ్య, సత్యనారాయణ, సభ్యులు జగదీష్, బాలకృష్ణ, అనిల్, సతీష్, సాయికాంత్, కార్యదర్శి బాబురావ్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### తెలంగాణ అమరవీరుల కుటుంబాల వేదిక డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 4,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం కోసం తమ బిడ్డల్ని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న అమరవీరుల కుటుంబాల బాధలను తీర్చే బాధ్యత ప్రభుత్వానిదేనని, కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 250 గజాల ఇంటి స్థలం, ప్రతిఅమరవీరుడి కుటుంబంలో ఒకరికి 25 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కావలి మన్యం, ప్రధాన కార్యదర్శి శశికళ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ అమవీరులు పట్ల గత ప్రభుత్వంలాగే నిర్లక్ష్యం వహించకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అమరవీరులు రాజకీయ నాయకుల వలే స్వార్థ ప్రయోజనాలకోసం ఉద్యమాలు ఏయలేదని ఈనెల తల్లి విముక్తికోసం బలిదానం చేసుకున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 8నెలలు అవుతున్నా ఇంతవరకు అమరవీరుల కుటుంబాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కావున అమరవీరుల కుటుంబాలకు సిఎం రేవంత్‌రెడ్డి సమయం ఇచ్చి వారి సాధక బాధకలను స్వయంగా వినాలని అందుకు ప్రొఫెసర్ కోదండరాం చొరవతీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, అమరవీరుల కుటుంబసభ్యులు సరస్వతి, చంద్రకాంత్, ప్రవీణ్, నరేష్, కనకరాజు పాల్గొన్నారు.



అమరవీరుల కుటుంబాలతో కలిసి మాట్లాడుతున్న కావలి మన్యం, శశికళ తదితరులు

### బైకు అదుపు తప్పి ఫ్లైఓవర్ పైనుంచి పడి

# ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మృతి

**సైబరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 4 ప్రభాతవార్త** అతివేగంగా ఫ్లైఓవర్‌పై బైకు నడుపుతూ అదుపు తప్పడంతో ఫ్లైఓవర్‌పై నుంచి కిందపడి ఇద్దరు యువకులు మృతిచెందారు. ఆదివారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో కొత్తగూడ ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకున్న ఈఘటన వివరాలు గచ్చిబౌలి పోలీసులు తెలిపిన ప్రకారం ఇలావున్నాయి. గుంటూరు జిల్లా రొంపిచెర్ల మండలం, విప్పరాల గ్రామానికి చెందిన ఉడతల బాలప్రసన్న(24) హైదరాబాద్ నగరంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ కొండాపూర్ మజీద్‌బండ ప్రాంతంలో నివాసముంటున్నాడు. అతను స్థానికంగా హాఫీజ్‌పేట్‌లో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసే గుంటూరు జిల్లా రొంపిచెర్ల మండలం మర్రిచెట్టుపాలెంకు చెందిన స్నేహితుడు కందుల రోహిత్ (26)తో కలిసి ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో బజాజ్‌డోమినర్ బైకుపై మజీద్ బండ నుంచి హఫీజ్‌పేట్ వైపు వెళ్తున్నారు. రోహిత్ బైకు నడుపుతుండగా ప్రసన్న వెనకాల కూర్చున్నాడు. బొటానికల్ గార్డెన్ ముందు కొత్తగూడ ఫ్లైఓవర్ ఎక్కగా బైకు అతివేగంగా ఉండడం వల్ల అదుపుతప్పి ఫ్లైఓవర్ రెయిలింగ్ గోడకు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైకుపై ఉన్న ఇద్దరు యువకులు గోడపైనుంచి ఎగిరి కిందిరోడ్డుపై పడ్డారు. ఇరువురికి తలకు బలమైన గాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకోగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు బాలప్రసన్నను కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి, రోహిత్‌ను మాదాపూర్ యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాలుగున్నర గంటల ప్రాంతంలో రోహిత్ మృతిచెందగా ఐదు గంటల ప్రాంతంలో బాలప్రసన్న మృతిచెందాడు.

ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు బాలప్రసన్న కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బాలప్రసన్న, కందుల రోహిత్ (ఫైల్‌ఫొటోలు)

### శ్రీసంగమేశ్వరస్వామి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో

## 5వ తేదీ నుంచి శ్రావణమాస పూజలు

**నాంపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్ వద్దనున్న అతిపురాతన శ్రీసంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామివార్ల దేవాలయంలో ఆగస్టు 5సోమవారం నుండి సెప్టెంబరు 3బుధవారం వరకు శ్రావణమాసమును పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ పేర్కొంది. ఇందులో భాగంగా 7బుధవారం శ్రీ ఆండాళ్ తిరునక్షత్రం ఉ.గం. 7నుండి శ్రీ గోదాదేవి అభిషేకం; 9శుక్రవారం శ్రీ నాగుల(గరుడ) పంచమి ఉ.గం.9నుండి గరుడాళ్వార్ అభిషేకం; 19శనివారం శ్రీసుదర్శన ఆళ్వార్ తిరునక్షత్రం ఉ.గం. 8నుండి శ్రీ సుదర్శనాళ్వార్ అభిషేకం; 16శుక్రవారం శ్రీ మూలానక్షత్రం ఉ.గం.9నుండి శ్రీసరస్వతీదేవి మూలమంత్ర హోమము, రాత్రి 6నుండి శ్రీలక్ష్మి సహస్రనామార్చన; 17శనివారం శనిత్రయోదశి శ్రీ శనైశ్వరస్వామి తిలతైలాభిషేకము; 19సోమవారం శ్రవణానక్షత్రం ఉ.గం.9నుండి శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణం; 22గురువారం సంకష్టహర చతుర్థి ఉ.గం.7నుండి శ్రీ గణపతి మూలమంత్ర హోమము, రాత్రి 6నుండి శ్రీ గణపతి అభిషేకము; 23శుక్రవారం ఉ.గం.9నుండి శ్రీ లక్ష్మి హోమము; 27మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి రాత్రి 6నుండి శ్రీకృష్ణస్వామి అభిషేకం; 29గురువారం అరుద్ర నక్షత్రం ఉ.గం.7నుండి శ్రీ రుద్ర హోమము; 31శనివారం శనిత్రయోదశి శ్రీ శనైశ్వరస్వామి తిలతైలాభిషేకము; సెప్టెంబరు 1 ఆదివారం మహాశివరాత్రి ఉ.గం.7-9.30లకు శ్రీ సంగమేశ్వరస్వామికి ఏకవార రుద్రభిషేకము; 2 సోమవారం సోమవతీ (సొలాల) అమావాస్య ఉ.గం.7-8.30-10లకు శ్రీ సంగమేశ్వరస్వామి ఏకవార రుద్రాభిషేకము అర్చకస్వాములచే నిర్వహించబడతాయని, అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజాకార్యక్రమాల్లో పాల్గొని స్వామివార్లకు కృతకు పాత్రులు కావాలని ఆలయ కార్య నిర్వహణాధికారి, ఆలయ కమిటీ వివరించారు.

# గుంతలు పూడ్చివేత

**నార్సింగి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలోని గంధంగూడ, బైరాగిగూడల మీదుగా నార్సింగికి వెళ్లే రోడ్డు మొత్తం ఇటీవల కురిసిన వర్షానికి మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. అడుగు అడుగునా ఈ గుంతలు ఏర్పాడడం వలన నిత్యం ఉద్యోగాలకు ఈ రోడ్డు పైనుంచే వెళ్లే వందలాది మంది వాహనదారులు నరకయాతన పడుతున్నారు. పలుమార్లు ఈ సమస్యను పరిష్కరించాలని సదరు వాహనదారులు కాలనీ ప్రతినిధులకు, ప్రజా ప్రతినిధులకు తెలిపారు. దీంతో ఆల్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు స్పందించి లారీలతో మొరం తెప్పించి, ఆదివారం శ్రమదానం చేసి గుంతలను పూడ్చి వేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు భోగాల శ్రీనివాస్, తలారి ప్రేమ్ కుమార్‌లు మాట్లాడుతూ వాహనదారులు పడుతున్న అవస్థలు చూడలేక మా సొంత డబ్బులు వేసుకొని మట్టి తెప్పించి, పూడ్చడం జరిగిందన్నారు. గంధంగూడ, బైరాగిగూడ ప్రాంతాలలో నివసిస్తున్న కాలనీ వాసులంతా ఈ లింక్ రోడ్డు పైనుంచే నార్సింగి, ఔటర్ రింగ్ రోడ్డు, గచ్చిబౌలి, మాదాపూర్, నానక్‌రాంగూడ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఈ రోడ్డును కాదనుకుంటే హైదర్షాకోట్, టిప్పుఖాన్ బ్రిడ్జి పైనుంచి నార్సింగికి చుట్టూ తిరుగాల్సి వస్తుందన్నారు. ఉద్యోగుల విన్నపం మేరకు గోతులమయమైన ఈ రోడ్డుపై మొరం వేసి చదును చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునరెడ్డి, రమేష్, రాజారాం, సుధాకర్, సాయి, భరత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



బైరాగిగూడ నుంచి నార్సింగికి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేస్తున్న ఆల్ కాలనీ అసోసియేషన్ సభ్యులు.

## పిల్లలకు నమ్మకాన్ని ఇస్తే అద్భుతాలను సృష్టిస్తారు

### -ప్రముఖ సైకాలజిస్ట్, రచయిత మల్లేష్ అన్నమైన

**చిక్కడపల్లి, ఆగస్టు 4ప్రభాతవార్త:** పిల్లలకు నమ్మకాన్ని ఇస్తే అద్భుతాలను సృష్టిస్తారని ప్రముఖ సైకాలజిస్ట్, రచయిత మల్లేష్ అన్నమైన అన్నారు. పిల్లలు విద్యలో రాణించడానికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సెయింట ఆడమ్స్ హైస్కూల్ అధినేత డాక్టర్ శ్రావణ్‌కుమార్ నిర్వహణలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ అంశాలపై కౌన్సిలింగ్ కార్యక్రమంజరిగింది.ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ పిల్లలు చెడువ్యసనాల వెళ్లకుండా తగినజాగ్రత్తలు తీసుకోవడంతో పాటు విద్యలో రాణించడానికి పూర్తి సమయాన్ని కేటాయించాలన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసినప్పుడే వారు ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. ప్రాథమిక విద్య దశనుంచే వారిలో క్రమశిక్షణతో పాటు మంచి అలవాట్లను నేర్పించాలన్నారు. ప్రతిభ ఎవరిసొత్తు కాదని, వారిలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. స్కూల్స్ ద్వారా తీసుకున్న కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాని ఉపద్యాయులను కోరారు. డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలకు తల్లే ఆది గురువు అని అన్నారు. పిల్లలకు ముఖ్యంగా డబ్బుకంటే సమయాన్ని ఇవ్వాలని, వారిలో ఎదుగుదలను చూడవచ్చన్నారు.కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త కడియాల ప్రభాకర్, విద్యార్థినీ,విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిటి రోడ్ల విస్తీర్ణాన్ని పెంచాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి

**నార్సింగి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో రోడ్ల విస్తీర్ణంను పెంచాలని కోరుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూలపల్లి కృష్ణారెడ్డి, రాంప్రసాద్‌రావ్ తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదర్షాకోట్‌లోని పరమేష్ హోటల్ నుంచి కేంద్రీయ విహార్ వరకు 40.ఫీట్ల బిటి రోడ్డును, శివశక్తి ఫ్యాక్టరీ నుంచి బైరాగిగూడ వరకు 50.ఫీట్ల బిటి రోడ్లను వేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు వివరించారు. విపరీతంగా పెరుగుతున్న జనాభాకు ప్రస్తుతమున్న రోడ్లు సరిపోవడం లేదని, ఈ రోడ్లను వెడల్పు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని, ట్రాఫిక్ జాం సమస్యకు పరిష్కారం చూపినట్లు అవుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. మా వినతిపత్రంను చదివిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వెంటనే పై రెండు రోడ్ల నిర్మాణంకు ఎస్టిమేట్లు తయారు చేయాలని కోరుతూ బండ్లగూడ జాగీర్ కమీషనర్ శరత్‌చంద్రకు లెటర్ రాశారని వివరించారు. ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించే గుణం ఉండడం వల్లనే వరుసగా నాలుగు మార్లు ఎమ్మెల్యేగా గెలుపొందుతున్నారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే స్పందన పట్ల కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, రాంప్రసాద్, లక్ష్మణ్, కుమార్, శంకర్, శ్రీనివాస్, విజయ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## పేద విద్యార్థుల చదువుల కోసం ఆర్థిక సహాయం

**నార్సింగి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఇద్దరు పేద విద్యార్థుల ఇంటర్ చదువుకయ్యే పూర్తి ఫీజును ప్రముఖ సామాజిక వేత్త ఉపేంద్రనాథ్‌రెడ్డి అందజేశారు. మణికొండలోని చైతన్య కళాశాలలోని యాజమాన్యంకు చెక్కులను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని కళాశాల విద్యను అభ్యసించేందుకు డబ్బులు లేక ఇంటి వద్దనే ఉండిపోయిన ఇద్దరు విద్యార్థినులు పూజాసింగ్, చక్రికలకు ఇంటర్ చదువులు పూర్తయ్యేంత వరకు ఎంత ఖర్చు వచ్చినా నేనే భరిస్తానని ఉపేంద్రనాథ్‌రెడ్డి తన సొంత డబ్బులను కళాశాల యాజమాన్యంకు అందజేశారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్లు బిట్లు పద్మారావ్, ఆలస్యం నవీన్ కుమార్, ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు సీతారం ధూళిపాళ, కార్యదర్శి ఆరిఫ్, సభ్యులు లక్ష్మణ్‌రావ్, దిలీప్ కక్కడ్, నరోత్తంసింగ్, రాజశేఖర్‌లు ఉపేంద్రనాథ్‌రెడ్డిని అభినందించారు.

# సిఎం పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామనడం పట్ల హర్షం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రవీంద్రాచారి

**సైఫాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేద ఇళ్ల పట్టాలు పంపిణి చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి హర్షం వ్యక్తం చేశారు. సంవత్సరాల క్రిందట ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు పట్టాలు పంపిణి చేసి, భూపోరాటాల సందర్భంగా నమోదైన కేసులను ఎత్తివేయాలని ఆయన కోరారు. ఆదివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవీంద్రాచారి మాట్లాడుతూ పట్టాల పంపిణి విషయంపై ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రాన్ని సమర్పించామని, ఈ విషయంపై ఆయన అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళడంతో సిఎం పట్టాలు పంపిణి చేస్తామని ప్రకటించడంపై ధన్యావాదాలు తెలిపారు.

ప్రభుత్వ, భూదాన్ భూముల్లో దశాబ్దాల క్రితం పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తు న్నారని, అయితే రెవిన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ మాఫియా నిత్యం వారిపైన బెదిరింపులకు, దాడులకు పాల్పడుతున్నదని, దీనిపై ప్రభుత్వం స్పందించి వారికి రక్షణ కల్పించాలని, భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ళపట్టాలు, డబల్ బెడ్‌రూంలకు ఇవ్వకుండా మాయ మాటలతో మోసంచేసిందని రవింద్రాచారి ఆరోపించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్ తదితర జిల్లాల్లో సిపిఐ నిర్వహించిన భూ పోరాటాల ద్వారా ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించి పట్టాలు పంపిణి చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన సిఎంకు విజ్ఞప్తి చేశారు.



పూజలు చేస్తున్న బిజెపి కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ వంశా తిలక్

## బోనాల వేడుకల్లో పాల్గొన్న వంశా తిలక్

**కంటోన్మెంట్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** బోనాల వేడుకలను పురస్కరించుకొని అంబేద్కర్‌నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయం, బాలంరాయిలోని సీతల పోచమ్మ దేవాలయాల్లో నిర్వహించిన బోనాల వేడుకలకు కంటోన్మెంట్ బిజెపి ఇన్‌ఛార్జి డాక్టర్ వంశా తిలక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీ కిషన్ మాదిగ, బిజెపి నాయకులు చిన్న వీరయ్య, దమ్మయ్య, గోనె సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### అంధ బాలికపై జరిగిన అఘాయిత్యం..

## సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌గౌడ్

**సైఫాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** మలక్‌పేటలోని ఒక అంధ విద్యార్థి 3వ తరగతి చదువుతున్న 8 ఏళ్ళ బాలికపై జరిగిన అఘాయిత్య ఘటనపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఇండియా డిమాండ్ చేసింది. నిందితులకు శిక్షపడేంత వరకు, ఆ బాలికకు న్యాయం చేసేంత వరకు ఉద్యమిస్తామని ఫెడరేషన్ హెచ్చరించింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీర రాఘవన్, సారా ప్రవీణ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బాలికపై జరిగిన అఘాయిత్య ఘటనపై ప్రభుత్వం, అధికారులు, పోలీసుల తీరు సరిగా సరిగా లేదని, బాధితురాలు తనకు జరిగిన అన్యాయంపై పోలీస్ స్టేషన్‌కు వెళితే పోలీసులు ఫిర్యాదును స్వీకరించకుండా చేశారని ఆరోపించారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఈ ఘటనపై స్పందించిన తీరు ఆక్షేపణీయంగా ఉందని విమర్శించారు. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తే హస్పటల్ వారి చొరవతో ఘటన వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం వేసిన కమిటీపై తమకు నమ్మకం లేదని ప్రభుత్వం తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని, బాలికకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. దివ్యాంగులపై ఐఎఎస్ అధికారి స్మిత సభర్వాల్ వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ నాయకులు అర్జున్, అంజయ్య, గోవింద్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అందుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలు అందుకోవాలి



మహిళలకు ఉచితంగా చీరెలు పంపిణీ చేస్తున్న సంతోష్‌యాదవ్

**సైఫాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** సమాజంలోని ప్రతి బాలిక విద్యను అభ్యసించి ఉన్నత శిఖాలను అధిరోహించాలని సుబ్రమణ్యస్వామి దేవాలయం మాజీ ఛైర్మన్ సంతోష్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఒక బాలిక విద్యను అభ్యసిస్తే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, అలాగే ప్రతి విద్యార్థినీ విద్యను అభ్యసిస్తే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ పేద మహిళలకు ఉచితంగా చీరెలు, విద్యార్థులకు పుస్కకాలు పంపిణి చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సాంకేతిక విద్యలో రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యార్థులు సాంకేతిక విద్యపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని, పోటీ పరీక్షల్లో విజయాలను సాధించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న పథకాలను మహిళలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ, సభ్యుడు మనిగండ్ల శ్రీనివాస్‌గుప్తా, కిష్టయ్య, చంద పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## పురస్కారాలు ప్రోత్సాహాన్ని అందిస్తాయి

### -తెలంగాణ పోలీసుహౌజింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ దామోదర్‌గుప్త

**చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:** పురస్కారాలు ప్రోత్సాహాన్ని అందిస్తాయని తెలంగాణ పోలీసుహౌజింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త అన్నారు. ఆదివారం కనకదుర్గ నృత్య విభావరి అధినేత్రి నిర్మలాప్రభాకర్ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ మహోత్సవం సందర్భంగా యువకళావాహిని అధినేత, సాంస్కృతిక దిగ్గజం స్వర్గీయ వైకె.నాగేశ్వరరావు అవార్డును జివిఆర్.ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుడిబండి వెంకటరెడ్డికి, అదే విధంగా గురుసత్కారాలను తెలుగు విశ్వవిద్యాలయం నృత్యవిభాగం పూర్వ ఆచార్యులు ప్రొఫెసర్ భాగవతుల సేతూరామ్, కళారత్న వోలేటి రంగమణి, యక్షగాన కంఠీరవ డాక్టర్ పసుమర్తి శేషబాబుకు అందించి గౌరవించే కార్యక్రమం డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధినేత సారిపల్లి కొండలరావు ఆశీస్సులతో శనివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. యువకళావాహిని అధినేత లంక లక్ష్మినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొల్లేటి దామోదర్‌గుప్త హాజరై ఈ పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో కథక్ కళాక్షేత్ర డైరెక్టర్ పండిట్‌అంజుబాబు, తెలుగు విశ్వవిద్యాలయం నృత్యవిభాగాధిపతి ప్రొఫెసర్ వనజా ఉదయ్, డాక్టర్ కుసుమ భోగరాజు తదితులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రఖ్యాత గాయనీ వెంపటి శ్రీవల్లి శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అంతకు ముందు కనకదుర్గ నృత్యవిభావరి శిష్యులచే గురువుకు గురుసత్కార కార్యక్రమం కన్నులపండువగా సాగింది.

## నేత్రపర్వంగా శ్రీవేంకటేశ్వర కళ్యాణం నృత్యరూపకం

**నాంపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** శ్రీమహావిష్ణువు పుడమిపై శ్రీనివాసునిగా అవతరించి భూతలరాజు కుమార్తె పద్మావతిగా జన్మించిన లక్ష్మీదేవిని పరిణయమాడిన సంఘటనలు కళ్లకుకట్టినట్లు ప్రముఖ కళాకారిణి నిహంత్రిరెడ్డి తన శిష్యబృందంతో ప్రదర్శించిన శ్రీ వేంకటేశ్వర కళ్యాణం నృత్యరూపకం ఆహుతులైన అశేషప్రేక్షకులకు నేత్రపర్వం కావించింది. అక్షధ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిహంత్రిరెడ్డి 60 మందికి పైగా నర్తకీమణులతో కూచిపూడి నృత్యశైలిలో శ్రీవేంకటేశ్వర కళ్యాణం నయనానందకరంగా ప్రదర్శించారు. విఖ్యాత నాట్యగురువు డా. శోభానాయుడు నృత్య రూపకల్పన చేసిన ఈ రూపకం బాలాంత్రపు రజనీకాంతరావు రచించగా కిచర్లకోట సూర్యప్రకాష్‌రావు స్వరకల్పన చేశారు. ప్రధాన పద్మావతి పాత్రలో నిహంత్రి, త్రిష వేంకటేశ్వరుని పాత్రలో ఒదిగిపోగా మిగతా కళాకారులు ఆయా పాత్రోచిత నర్తనంతో నృత్యరూపకాన్ని రక్తికట్టించి ప్రతీఒక్కరి ప్రశంసలందుకున్నారు.